కరెంటు ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11కేవీ ఆర్‌కే పేట్, ధూల్‌పేట్ అండర్ గ్రౌండ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్, అజారి హోటల్, మజీద్, గంగాబౌలి, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే దత్తాత్రేయనగర్ ఓవర్ హెడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జ్యోతి గ్యాస్‌లైన్, పాపలాల్ పీటి, వెంకటమ్మ తోట, మల్లేపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన డీవోపీ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న హోంశాఖ ప్రధాన కార్యదర్శి రావిగుప్తా తదితరులు

సిటీ కోర్టులు: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీవోపీ) నూతన కార్యాలయాన్ని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎస్.సాంబశివారెడ్డి సమక్షంలో రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి రావిగుప్తా ప్రారంభించారు. ఇప్పటి వరకు డీజీపీ కార్యాలయంలో కొనసాగిన డీవోపీ విభాగాన్ని పక్కనే ఉన్న సీఐడీ కార్యాలయంలోకి తరలించారు. ఇప్పటి వరకు డీజీపీ కార్యాలయంలో ఉన్న తెలంగాణ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక సేవల విభాగం, సీఐడీలోని జనరల్ అఫెన్సెస్ వింగ్ విభాగాలన్నీ ఒక్కొక్కటిగా మార్చారు. ఈ నేపథ్యంలోనే డీవోపీ కార్యాలయాన్ని కూడా సీఐడీ తరలించారు. రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి రావిగుప్తా సోమవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎస్.సాంబ శివారెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్



సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ హిందూ పరిషత్ (ఏహెచ్‌పీ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన నోముల వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ భాయ్ తొగాడియా ఆయనను సోమవారం బెంగుళూర్‌లో జరిగిన సమావేశంలో నియమించారు. నోముల వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఏహెచ్‌పీ సంస్థను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. హిందూ రక్షణ, సేవా సంపతి, సృష్టి, గౌరవం, అనే నినాదంతో ముందుకు సాగుతామన్నారు.

మెహిదీపట్నం సర్కిల్-12 ఏసీపీగా ఎల్.స్వామి



నాంపల్లి: మెహిదీపట్నం సర్కిల్-12 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా ఎల్.స్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా పనిచేసిన కృష్ణమూర్తి ఉప్పల్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎల్.స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏ నిర్మాణమైనా ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

27వ మైలురాయి నాటకం 26న

నాంపల్లి: నిజం గెలుస్తుందన్న మాట నిజమే కానీ గెలిచేదంతా నిజం కాదు అనే ప్రధాన అంశంగా రాసిన నాటకం '27'వ మైలురాయి నాటకం ఈ నెల 26న సాయంత్రం 6.30 గంటలకు తెలుగు వర్సిటీలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రదర్శిస్తున్నట్లు రసరంజని సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం- అదే మా బాట, అదే మా మాట అనే శీర్షికతో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తోందని తెలిపారు. రవీంద్రభారతి వేదికగా ప్రదర్శించాల్సిన నాటకాన్ని అనివార్య కారణాలతో తెలుగు వర్సిటీకి మార్చామని, ఈ విషయాన్ని ప్రేక్షకులు, కళాకారులు గమనించాలని కోరారు. ఈ నాటకాన్ని పి.టి.మాధవ్ రచించగా రౌతు వాసుదేవరావు(వాసు విజయవాడ) దర్శకత్వంలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

గుడిలో గంటలు మాయం

చాంద్రాయణగుట్ట: గుడిలో గంటలు చోరీ అయిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లలితాబాగ్ మారుతీనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వెలుపల ఉన్న గంటలను చోరీ చేశారు. దీనిని గమనించిన ఆలయ కమిటీ ప్రతినిధి ఆనంద్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పాతబస్తీకి
ఆధ్యాత్మిక శోభ

ఒకేసారి బోనాలు, మొహర్రం ప్రారంభం

- 26న గోల్కొండ అమ్మవారికి బోనాల సమర్పణ మరూ..
- అదేరోజు మొహర్రం సంతాప దినాలు ప్రారంభం
- నెల రోజుల పాటు బోనాల జాతర ఉత్సవాలు
- 68 రోజుల పాటు షియా ముస్లింల సంతాప దినాలు
- ఏర్పాట్లలో పోలీసులు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి



బోనాల జాతరకు ముస్తాబయిన మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయం



డబీర్‌పురాలోని బీబీకాఅలావా

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు, మొహర్రం సంతాప దినాలు ఒకేసారి వస్తున్నాయి. ఈ నెల 26 నుంచి నెల రోజుల పాటు బోనాలు కొనసాగనుండగా.. షియా ముస్లింలు 68 రోజుల పాటు మొహర్రం సంతాప దినాలను పాటిస్తారు. దీంతో రెండు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నగరం వేదిక కానుంది. దీంతో ఎవరికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు, జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. 1985లో మొహర్రం సంతాప దినాలతో పాటు వినాయక నవరాత్రి ఉత్సవాలు ఒకే రోజు కలిసి వచ్చాయి. అప్పటి నుంచి ఏదో ఒక ఏడాది ఇరు వర్గాలకు చెందిన ఉత్సవాలు ఒకేసారి కలిసి వస్తున్నాయి. బోనాలు, వినాయక ఉత్సవాలు, బక్రీద్, మొహర్రం సంతాప దినాలు.. ఇలా హిందూ ముస్లింలకు చెందిన పండగలు ఒకే రోజు వస్తుండటంతో ఇరు వర్గాల ప్రజల్లో సోదరభావం చాటుతోంది.

గోల్కొండ అమ్మవారికి బంగారు బోనంతో..

ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ఈ నెల 26న ప్రారంభమై.. వచ్చే నెల 21న ముగియనున్నాయి. బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. బోనాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరుల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు, ఉత్సవాల నిర్వాహకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 26న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే మొదటి బంగారు బోనంతో పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి, బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లితో పాటు విజయవాడ కనక దుర్గమ్మకు బంగారు పాత్రలో బోనం, పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పిస్తారు.

హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ..

హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లింలు నిర్వహించే సంతాప దినాలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయి. ఒకవేళ ఆకాశంలో నెలవంక 26న కనిపిస్తే.. 27 నుంచి మొహర్రం సంతాప దినాలను కొనసాగిస్తారు. డబీర్‌పురా బీబీకాఅలావాలో ఆలంలను ప్రతిష్ఠించి 1వ మొహర్రం నుంచి 10వ మొహర్రం వరకు మజ్లిస్, మాతం నిర్వహిస్తారు. సంతాప దినాల్లో భాగంగా ఈ నెల 6న పాతబస్తీ వీధుల్లో అంబారీతో.. 10వ తేదీన మొహర్రం సామూహిక ఊరేగింపు కొనసాగుతుంది. డబీర్‌పురా బీబీకా అలావాకు చెందిన బీబీకాఆలంతో షియా ముస్లింలు ఊరేగింపులో పాల్గొంటారు. అన్ని ఆషుర్‌ఖానాల వద్ద ఏర్పాట్లపై అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, షియా ముస్లిం మత పెద్దలతో సమావేశాలు నిర్వహించారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార వ్యవస్థల పాత్ర కీలకం



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: సహకార భావనతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం వాక్‌థాన్ నిర్వహించారు. అబిడ్స్‌లోని ప్రధాన కార్యాలయం వద్ద ప్రారంభమై నాంపల్లి వరకు కొనసాగి తిరిగి ప్రధాన కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థలు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. వాక్‌థాన్‌తో సహకార రంగ ప్రాధాన్యత, ప్రజల సంక్షేమంలో బ్యాంకుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నాబార్డ్ సీజీఎం బి.ఉదయభాస్కర్, ఎండీ వై.కృష్ణారావు, అపెక్స్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు కొత్తకురుమ సత్తయ్య, సీజీఎం టి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

30లోపు రేషన్ బియ్యం తీసుకోవాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏసీఎస్‌ఓ సురేందర్

యాకుత్‌పురా: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30 వరకు కొనసాగనున్న మూడు నెలల ముందస్తు రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్-02 ఏసీఎస్‌ఓ మోకా సురేందర్ సూచించారు. పురానీహవేలీలోని సర్కిల్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియను సోమవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి చేరుకొని ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన రేషన్ కార్డుల కోసం సర్కిల్ పరిధిలో మొత్తం 40,674 దరఖాస్తులు రాగా ఇందులో ఇప్పటి వరకు 5,874 పరిశీలించి 4,674 మంది లబ్ధిదారులను గుర్తించి పలు కారణాలతో 1200 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు చెందిన ముందస్తు రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా ఇప్పటి వరకు 90 శాతం పంపిణీ పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులు ఈ నెల 30లోపు తీసుకోవాలని తెలిపారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే మజ్లిస్ లక్ష్యం



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అన్ని వర్గాల సంక్షేమం కోసమే పని చేస్తూ వస్తోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. నానల్ నగర్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లిస్ సెక్యులర్ పార్టీగా పుట్టిందన్నారు. మజ్లిస్ విధానాలకు ప్రజలు ఆమోద ముద్ర వేశారన్నారు. ముఖ్యంగా కార్వాన్ నియోజకవర్గంలో మూడు అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి మెజార్టీ పెరుగుతూ వస్తోందన్నారు. నియోజకవర్గంలో బీసీలు, దళితులు, పేద మైనార్టీల కోసం ఎంతో కృషి చేశానన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నానన్నారు. ముఖ్యంగా దళిత బంధు పథకం అర్హులైన వారికి మంజూరయ్యేలా చూశానని చెప్పారు. బీసీలు, మైనార్టీలకు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధికి రుణాలు ఇప్పించినట్లు చెప్పారు. టోలిచౌకీ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, అబీబ్ చౌస్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



కలెక్టర్ దాసరి హరిచందనకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలో అర్హులైన వారికి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. లక్డీకాపూల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమెకు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ సముదాయాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన వారికే ఇప్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగినా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ చంద్రమోహన్

నాంపల్లి: హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి సౌత్ వెస్ట్ డీసీపీ చంద్రమోహన్ హాజరయ్యారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల వివరాలు, వారి కదలికలను, ప్రవర్తనను ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్‌ను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లతో డీసీపీ చంద్రమోహన్ కాసేపు మాట్లాడారు. పదేళ్ల పాటు సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తేస్తామని వారికి భరోసా ఇచ్చారు. పోలీసులు సెటిల్‌మెంట్లు, ఘర్షణల్లో తలదూరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో రౌడీషీటర్లుగా చలామణి అయితే ఆ కుటుంబానికి చెడ్డ పేరు వస్తుందని, వారి పిల్లలపై కూడా ఆ ప్రభావం ఉంటుందన్నారు. విద్యా, ఉద్యోగాలు పొందే అవకాశం ఉండదని తెలిపారు. మంచి నడవడికతో సమాజంలో మసలుకోవాలని కోరారు. త్వరలోనే బోనాలు, మొహరం పండగలు సమీపిస్తున్నాయని, ఈ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్‌తో పాటు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్, ఎస్సైలు సందీప్, అశోక్, మోనయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



నర్సింలును సత్కరిస్తున్న రాజేష్ యాదవ్

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి, ప్రగతికి తనవంతు కృషి చేస్తానని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సెక్రెటేరియట్ క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.నర్సింలు పేర్కొన్నారు. నూతనంగా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆయనను భారతీయ యాదవ సేవా సమితి అధ్యక్షుడు బి.రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నర్సింలు మాట్లాడుతూ.. సచివాలయం ఉద్యోగులు తనపై నమ్మకంతో ఉపాధ్యక్షుడిగా గెలిపించారన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిరోజూ పలు విభాగాల్లో ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. తనను గెలిపించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన నాట్య తరంగిణి



నాంపల్లి: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నటరాజ నృత్య సమితి ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో నాట్య తరంగిణి-2025 శీర్షికన నృత్య విభావరి జరిగింది. నటరాజ నృత్య సమితి వ్యవస్థాపకురాలు, నృత్య గురువు కె.తరంగిణి శిష్య బృందం వేదికపై ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరింపజేశాయి. సైబరాబాద్ 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి.నిషిక, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ రాందాస్ తేజోవత్, ఆధ్యాత్మిక వేత్త పి.మీనాక్షి శ్రీనివాస్ హాజరై కళాకారులను అభినందించారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్

చార్మినార్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కిల్ పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్‌కు చెందిన అక్రమ నిర్మాణం సమస్యపై-1, చార్మినార్ సర్కిల్‌కు చెందిన అక్రమ నిర్మాణం, ఇంజనీరింగ్, ఫుడ్ కోర్టు సమస్యలపై 3, మలక్‌పేట్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణం సమస్యపై 1తో కలిసి మొత్తం 5 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్తీలు, కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏఎంసీ రాజారావు, మలేరియా సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, వెటర్నరీ విభాగం సీనియర్ అసిస్టెంట్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచవరపు పద్మ రచించిన సప్తపద పద్మాలు పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. పలు అంశాలను చక్కగా వివరించిందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కవి సుధామ, సాహితీవేత్త, విహారి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మట్టిగుంట వెంకటరమణ, జీవీ నర్సింహమూర్తి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న సోమ్‌రాజ్ సింగ్, ఇంద్రసేన్, రవీందర్‌సింగ్



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

అబిడ్స్: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బలిదాన్ దివస్‌గా నిర్వహించారు. గోషామహల్ జుమ్మేరాత్‌బజార్‌లో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమ్‌రాజ్ సింగ్, ఇంద్రసేన్, రవీందర్ సింగ్, సుధీర్ సింగ్, జైపాల్ సింగ్, రామ్ విపిన్ తదితరులు పాల్గొన్నారు.


మోజంజాహీ మార్కెట్ చౌరస్తాలో..

సుల్తాన్‌బజార్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని సోమవారం మోజంజాహీ మార్కెట్ చౌరస్తాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, నాయకులు బంగారు సుధీర్‌కుమార్, అమర్ సింగ్, రాజ్‌కుమార్, రఘునాథ్, మహేందర్, జై తివారి, వెంకట్‌రెడ్డి, అరుణ్ జగపతి, జనార్దన్, సతీష్ పాల్గొన్నారు.



శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు భీష్మ, ఓంప్రకాశ్, పాండుయాదవ్ తదితరులు

గోశాలలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



గోల్కొండ: బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని బీజేపీ నాయకులు సోమవారం గుడిమల్కాపూర్‌లోని ఓంకార్ గోశాలలో మొక్కలు నాటారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌లో భాగంగా ఈచ్ వన్ ప్లాంట్ వన్ కార్యక్రమాన్ని నిర్వహించామని బీజేపీ నాయకులు జొన్నకుంటి మధుసూదన్ తెలిపారు. ఎస్.శ్రీనివాస్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్, ఎం.శ్రీనాథ్ తదితరులున్నారు.

సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

నాంపల్లి: సమసమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ అధ్యక్షుడు రొయ్యూరు శేషసాయి అన్నారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సోమవారం రాత్రి ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో పుడమి సాహిత్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన పబ్లిక్ సర్వీస్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషసాయి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. సమాజం బాగుంటేనే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందన్నారు. అందుకు సేవా రంగంలోని వారు ముందుకు వచ్చి సంఘం నిర్మాణంలో తమవంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు. కల్చరల్ అంబాసిడర్ ఆఫ్ నార్త్ అమెరికా ద్విభాషి ప్రభాశాస్త్రి మాట్లాడుతూ.. మానవత్వంతో అందించే సాయం మనిషిని మహోన్నతుడిగా నిలబడుతుందని అన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య వ్యవస్థాపకుడు డాక్టర్ కూన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. మనం సంపాదించిన దానిలో కొంత పేదలకు సాయం అందించాలన్నారు. అనంతరం విభిన్న రంగాల్లో కృషి చేసిన 20 మంది ప్రముఖులకు పయనీర్ జాతీయ పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ఖమ్మం జిల్లా కన్వీనర్ వర్దిబోయిన బాబు, ప్రముఖ సామాజిక వేత్తలు అంజత్ ఖాన్, డాక్టర్ తురగా సూర్యారావు, డాక్టర్ చల్లగాని సతీష్, సాహితీవేత్త జల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో శేషసాయి, డాక్టర్ అద్దంకి రాజాయోనా, డాక్టర్ బాల్‌రెడ్డి